అంగన్‌వాడీల్లో భోజనం భేష్!

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడం, ఆటలు ఆడించడం, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యకరమైన సూచనలు, సలహాలిచ్చేందుకు, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ పాఠశాలలను ఏర్పాటు చేసింది. వీరందరికీ అంగన్‌వాడీ పాఠశాలల్లో ప్రతీరోజు మధ్యాహ్నం భోజనం వండి వడ్డిస్తున్నారు. కానీ వీరికి దొడ్డు బియ్యంతో ఆహారం అందించడం కొంత ఇబ్బందికరంగా మారింది. రేషన్ దుకాణాలలో ప్రజలకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యం అందిస్తున్న ఉన్నతాధికారులు చిన్నారులకు కూడా ఆ సదుపాయం కల్పించాలని నిర్ణయించి ఇటీవలే ఆచరణలో పెట్టారు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంతోషంగా ఒకపూట భోజనం తృప్తిగా ఆరగిస్తున్నారు.


అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న టీచర్లు

- పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా ప్రారంభం
- క్రమంగా పెరుగుతున్న హాజరుశాతం
- హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్లు, లబ్ధిదారులు

ఇల్లెందురూరల్: మండలంలో మొత్తం 202 అంగన్‌వాడీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 139 ప్రధాన కేంద్రాలు, 63 మినీ కేంద్రాలు. ఆయా అంగన్‌వాడీలల్లో మొత్తం గర్భిణులు 574 మంది, బాలితలు 501 మంది, ఆరు నెలల నుంచి మూడేళ్ల మధ్య ఉన్న చిన్నారులు 2,737 మంది, ఆరేళ్ల లోపు చిన్నారులు 2,019 మంది ఉన్నారు.

ముద్ద దిగడమే ఇబ్బందిగా...

అంగన్‌వాడీ పాఠశాలల్లో నిన్నటి వరకు దొడ్డు బియ్యంతో ఆహారం అందించేవారు. కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రులు తమ పిల్లలకు మధ్యాహ్నం అంగన్‌వాడీ పాఠశాలల్లో వండిన భోజనం తినిపించేందుకు ఇబ్బంది పడేవారు. దొడ్డు బియ్యంతో వండటంతో చిన్నారులు గుటక వేయలేక ముఖం తిప్పేవారు. ఇంతేకాకుండా ఇంటి వద్ద సన్న బియ్యంతో భోజనం ఆరగించే బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ పాఠశాలల్లో దొడ్డు బియ్యంతో భోజనం ఆరగించేందుకు ఇబ్బందిపడేవారు. దీంతో పలు కేంద్రాలలో గర్భిణులు, బాలింతల హాజరు తక్కువగా ఉండేది. కేవలం పాలు, గుడ్లు మాత్రమే తీసుకొని ఇంటికి వెళ్లేవారని పలువురు అంగన్‌వాడీ ఉపాధ్యాయులు చెబుతున్నారు. కానీ అంగన్‌వాడీ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం ప్రారంభించిన నాటి నుంచి చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు పెరుగుతూ వస్తోందని.. అందరూ తృప్తిగా భోజనం ఆరగిస్తున్నారని పేర్కొంటున్నారు.

కేంద్రాలకు వస్తేనే పౌష్టికాహారం...

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పలు రూపాల్లో పౌష్టికాహారం అందిస్తుంటారు. కాలక్రమేణా మార్పులు చేస్తూ మెరుగైన ఆహారం అందించేందుకు ఐసీడీఎస్ ఉన్నతాధికారులు మార్పులు చేస్తూ వచ్చారు. సరఫరా చేస్తున్నది ఏదైనా అంతిమ లక్ష్యం పౌష్టికాహారం అందించడమే వారి విధి. ఇలా ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆహారం విషయంలో మేలు చేస్తున్నారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఉడికించిన ఒక గుడ్డు, 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5గ్రాముల నూనెతో చేసిన ఆహారం, 20 గ్రాముల మురుకులు, 50 గ్రాముల బాలామృతం అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వారికి 16 గుడ్లు పంపిణీ చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద రోజుకు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, ఇతర పోషకాలతో భోజనం అందిస్తున్నారు.

హాజరు శాతం పెరిగింది...



అంగన్‌వాడీ పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం అందించడం ప్రారంభించినప్పటి నుంచి చిన్నారుల హాజరు క్రమంగా పెరుగుతూ వచ్చింది. గర్భిణులు, బాలితలు కూడా క్రమం తప్పకుండా వచ్చి పౌష్టికాహారాన్ని స్వీకరిస్తున్నారు. మంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పడంలో విజయవంతంగా కృషి చేస్తున్నాం.

– అన్నపూర్ణ, సూపర్‌వైజర్, ఐసీడీఎస్

సన్నబియ్యంతో ఆహారం ఇస్తున్నాం



అంగన్‌వాడీ పాఠశాలల్లోనూ సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నాం. గతం కంటే నాణ్యమైన భోజనం చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందుతోంది. ప్రతీరోజు కేంద్రాలకు వచ్చే వారికి అందిచాల్సిన పౌష్టికాహారం ఇస్తున్నాం. కేంద్రాలకు వచ్చే ప్రతీఒక్కరూ సన్నబియ్యంతో భోజనం ఇష్టంగా తింటున్నారు.

– లక్ష్మీప్రసన్న, సీడీపీఓ, ఇల్లెందు మండలం

సుభాష్‌నగర్‌లో వికసిత్ భారత్ గ్రామసభ

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో శుక్రవారం వికసిత్ భారత్ గ్రామసభ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలులో ఉన్న పలు సంక్షేమ పథకాలను దృశ్య రూపకంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్, సాధికారతపై మహిళలకు భరోసా, అణగారిన వర్గాల సామాజిక భద్రత, పేదల కోసం కనీస మౌలిక సౌకర్యాలు, రైతు సంక్షేమానికి భరోసా, ఆహార భద్రతకు భరోసా, చోదక శక్తిగా ఆత్మ నిర్భర్ భారత్, అంకుర భారతం వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఏపీఎం దుర్గారావు, కార్యదర్శి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేడు గ్రామసభలు

సుజాతనగర్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా చివరి రోజు శనివారం కోయగూడెం, సీతంపేట బంజర, పాత అంజపాపురం గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని మండల అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టేకులపల్లి: మండలంలో శనివారం దాసుతండా, టేకులపల్లి, సులానగర్, తడికలపూడి, కొప్పురాయి, బోడు గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామ సభలు ఉంటాయని ఎంపీడీఓ కోట వీరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో స్కావేంజర్ ఉద్యోగ నియామకం కోసం మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక స్కావేంజర్ పోస్టు కోసం 7వ తరగతి పాసైన అన్ని కులాల మహిళా అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ లోపు స్థానిక కేజీబీవీ అందజేయవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం


సంతాపం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

పాల్వంచరూరల్: మహబూబ్‌నగర్‌లోని మైనార్టీ కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి మృతికి పాల్వంచ మండలం సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల అధ్యాపకులు శుక్రవారం సంతాపం తెలిపారు. విద్యార్థి మృతి కారణంగా కళాశాలలో విధుల నుంచి తొలిగించిన ఉపాధ్యాయులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, ఆర్‌కే.సరోజిని, సాంసంగ్, దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు, రగ్గులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామపంచాయతీలో జీఎస్‌ఎస్ (గ్రేస్ సర్వీస్ సొసైటీ) ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. సర్పంచ్ కవిత చేతుల మీదుగా ఒక్కో కుటుంబానికి చీర, చొక్కా, రగ్గ అందజేశారు. సంస్థ ప్రతినిధులు జాన్, సుందరం, మణెమ్మ, పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు


సింగరేణి(కొత్తగూడెం): క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరామ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మేదర బస్తీలోని విశ్వబ్రాహ్మణ సత్రంలో శుక్రవారం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్‌ను డాక్టర్ వసుధ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి పథంలో నడుస్తోందని, నూతన కార్యక్రమాలతో సంఘ చరిత్రలో నూతన అధ్యాయం చోటుచేసుకుందన్నారు. కరోనా నేపథ్యంలో సంఘం కార్యక్రమాలను అనుకున్న మేరకు నిర్వహించలేకపోయామని, అభివృద్ధి సాధించుకున్నప్పటికీ కమిటీ నిర్దేశించుకున్న ప్రణాళికలో 20 శాతం మాత్రమే అమలు చేయగలిగినట్లు చెప్పారు. శక్తివంచన లేకుండా కృషి చేసినందుకు సంఘం రాష్ట్ర కమిటీ నుంచి కూడా ప్రశంసలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీబీ ప్రసాద్, ఆనందాచారి, బెజ్జంకి శ్రీనివాస్, కందూరి బ్రహ్మయ్య, సిరికొండ రమేష్, అప్పారావు, సదానందం, నవీన్, వెంకట వీరాచారి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం (7856/2001) నూతన సంవత్సరం క్యాలెండర్లను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ శుక్రవారం సింగరేణి భవన్‌లో ఆవిష్కరించారు.

ముందుగా నూతన సీఎండీ గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, సురేష్, హనుమంతు, వి.కృష్ణయ్య, ఏ.భాస్కర్‌రావు, బి.నాగేశ్వరరావు, డి.పంతులు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ క్యాలెండర్లు అందజేత

టేకులపల్లి: బోడు గ్రామానికి యువజన నాయకుడు అన్నారపు రవి ఆధ్వర్యంలో పలువురు యువకులు బోడు గ్రామంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, బోడు ఎస్ఐ బత్తిని రంజిత్‌లను శుక్రవారం కలిశారు. వారికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో పూనెం సురేందర్, భూక్యా వెంకటేశ్, గడ్డం మధు రెడ్డి, చిలువేరు చంద్రశేఖర్, సాంబయ్య, ఖాదర్ బాబు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ సమావేశానికి తరలిరండి


మాట్లాడుతున్న కిలారు నాగేశ్వరరావు

పాల్వంచ: 9వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అధ్యక్షతన జరగనున్న ఖమ్మం పార్లమెంటరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కిలారు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గట్టాయిగూడెంలోని కిలారు నివాసంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. కిలారు మాట్లాడుతూ... త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానం చేసిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బరపటి వాసుదేవరావు, సరస్వతి, మహిపతి రామలింగం, కాంపెల్లి కనకేశ్, కాల్వ ప్రకాశ్‌రావు, పూసల విశ్వనాథం, మల్లెల రామ్మూర్తి, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, చింతా నాగరాజు, కిలారు నాగమల్లేశ్వరరావు, బండి చిన్న వెంకటేశ్వర్లు, కనగాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే కూనంనేనిని సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ ఆల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం రామా టాకీస్ ఏరియాలోని సీపీఐ కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును శాలువతో సన్మానించారు. గాజుల రాంచందర్, ప్రధాన కార్యదర్శి బండ్లకృష్ణ, నామోజు గోవిందాచారి, మద్దినేని వెంకటేశ్వర్లు, గజేంద్రబాబు, దాసరి శ్రీను, దేవినేని వెంకటేశ్వర్లు, ముత్యాల రాంచందర్, రాజూరి దిలీప్‌కుమార్, దాసరి సత్యనారాయణ, నాగేందర్, పరిమల నర్సయ్య, ఎస్‌కే బాబు, మండల మల్లయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న కొత్వాల

పాల్వంచ: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం పూజారి మాధవన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన సంత్రం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బందెల శ్రీనివాస్, సంతోశ్, గుడివాడ సత్యం, శంకర్ మణి, చారి, వెంకట్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

పాల్వంచ: పట్టణంలోని శ్రీసీతారామాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గోపాలచార్యులు ఆధ్వర్యంలో చిన్నజీయర్ స్వామి ప్రథమ శిష్యులు దేవనాథ జీయర్ స్వామి శిష్యబృందం భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఈఓ రజినికుమారి, గౌరవ సభ్యులు చలవాది ప్రకాశ్, సేవాదళ్ సభ్యులు పెండ్యాల రోజాలక్ష్మి, కొండ్లె ఉమాసావిత్రి, రంగా శిరీష, ధనలక్ష్మి, నిర్మల, స్రవంతి, సుమ, హారిక, వాసవి, సుజాత, మౌనిక, లత, కవిత, ఝాన్సీ, కవిత, జయశ్రీ పాల్గొన్నారు.

హైపర్ కమిటీ వేతనాలు అందించాలి

ఇల్లెందు: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అందించాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. జీఓ 22 అమలు చేయాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, అగ్రిమెంట్ ప్రకారం బోనస్ చెల్లించాలని ఏఐటీయూసీ నేతలు కోరినట్లు ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, ఎస్ఐ రంజిత్

టేకులపల్లి: క్రీడలతో మానసికోల్లాసం పెరుగుతుందని, యువతీ, యువకులు క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఆర్‌సీ పేట పంచాయతీ పాతర్లగడ్డలోని మురుట్ల చెరువు గ్రౌండ్‌లో స్థానిక యూత్ ఆధ్వర్యంలో మూతిసాగర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఐదు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మొత్తం 25 జట్లు తలపడనున్నాయి. 13వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ జరగనుందని, మొదటి బహుమతి రూ.20,016, ద్వితీయ 12,016 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అన్నదానం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం నిరుపేదలకు అన్నదాన నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు పులి రాబర్ట్ రామస్వామి, కొయ్యడ నగేష్, నరేష్, సంక ప్రశాంత్, ముక్క మనోహర్, రాజసౌజన్య, బిట్టు, రవి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం..


ఇల్లెందు: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లెందు: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు కోసం గ్రామసభలు నిర్వహిస్తోందని ఈ గ్రామసభలలో దరఖాస్తులు అందజేసిన వారికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం స్టేషన్ బస్తీలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలి, ఏఈ కుమారస్వామి, తహసీల్దార్ రవికుమార్, కౌన్సిలర్ కొండపల్లి సరిత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు పక్కాగా అమలవుతాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కొమరారం గ్రామపంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పకడ్బందీగా అమలు చేసేందుకే లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రజాపాలన పేరుతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం అందిస్తోందని గుర్తుచేశారు. మహిళలకు నెలకు రూ.2,500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు త్వరలోనే ప్రజలకు చేరుతాయన్నారు. మెరుగైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కొమరారం సర్పంచ్ నాళి కృష్ణవేణి, ఎంపీటీసీ బిచ్చా, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని టేకులపల్లి, దాసుతండా, సులానగర్ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. సుపరిపాలనను ప్రజలకు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా పాలనతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. బోడ సరిత, ప్రియాంక, అజ్మీక బుజ్జి, ఇర్ప లక్ష్మీనారాయణ, నర్సమ్మ, చింత మంగమ్మ, ఎంపీడీఓ వీరబాబు, తహసీల్దార్ కృష్ణవేణి, గాంధీ, రాంబాబు, నవీన్, ఎస్ఐ రమణారెడ్డి, కిరణ్, శరత్, బాలకృష్ణ, దేవా, సలార్, కేఎం తార తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతిపత్రం


తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్ చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మం క్యాంప్ ఆఫీస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్ చేసి, ఏఎంసీ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత ఉప మార్కెట్ యార్డులో మౌలిక వసతులు లేక రైతులు, హమాలీలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. స్పందించిన మంత్రి శాశ్వత మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, లింగాల వీరభద్రం, తాటి నరసింహారావు, జవహర్ లాల్, బాబురావు, నరసింహారావు పాల్గొన్నారు.

బలరామ్ నియామకంపై హర్షం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ సంస్థకు నూతన చైర్మన్‌గా ఎన్.బలరామ్‌ను నిమించటం పట్ల భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దెల శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్‌కే నగర్‌లో ఏర్పాటు చేసిన సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మద్దెల మాట్లాడుతూ.. అంకితభావం కలిగిన దళిత జాతి ముద్దుబిడ్డ బలరామ్‌ను సంస్థలో అత్యున్నత స్థానంలో నియమించటం గొప్ప విషయం అన్నారు. సమావేశంలో అందెల ఆనందరావు, కూసపాటి శ్రీనివాసు, మందా హనుమంతు, బొమ్మెర శ్రీనివాస్, అల్లి శంకర్, ధన్‌రాజ్, గుండా రమేష్, మందా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివకుమార్

ఉపాధి హామీ పనులపై తనిఖీ


మాట్లాడుతున్న పరిశీలన అధికారి శ్రీకాంత్

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. 2023 మార్చి నుంచి 2023 డిసెంబర్ 31వ తేదీ వరకు గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో చదివి వినిపించారు. పరిశీలన అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పేదలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత వారిపైనే అధికంగా ఉంటుందన్నారు. పంచాయతీ పాలకవర్గం, అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించి పంచాయతీ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. సర్పంచ్ వల్లాల మంగమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ అవేర్‌నెస్‌పై అవగాహన

టేకులపల్లి: స్ట్రీట్ కాజ్ కేఐఎంటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం టేకులపల్లి మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు బల్లెం దేదీప్యచే మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా సులానగర్, బొమ్మనపల్లి హైస్కూల్లో విద్యార్థులు ఎస్సెస్సీ పూర్తయిన తర్వాత.. ఏ కోర్స్ చదవాలి, ఏ కోర్సులో ఉద్యోగ అవకాశాలు ఉంటాయో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉచిత కుట్టు మిషన్ సెంటర్ను సందర్శించి, కుట్టు మిషన్ నిర్వాహకులకు ఐదు మిషన్లు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సులానగర్ హైస్కూల్ హెచ్ఎం, గుర్రం దేవదాస్, మంగీలాల్ నాయక్, ఎక్స్ ప్రెసిడెంట్ బాలాజీ, వైష్ణవి కొంపల్లి, అఖిల్, బాబా గాంధీ, బల్లెం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


బొమ్మనపల్లి హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సింగరేణిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ విభాగం సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణ కోసమే కాకుండా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల ఆరోగ్య రక్షణకు కూడా పనిచేయటం అభినందనీయమని సింగరేణి మెయిన్ ఆస్పత్రి సీఎంఓ సుజాత, జీఎం సెక్యూరిటీ దీక్షితులు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని కార్పొరేట్ సెక్యూరిటీ కార్యాలయంలో తలసేమియా వ్యాధి పిల్లల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ... అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, రక్తదానం ప్రాణదానంతో సమానం, నూతన సంవత్సరంలో ఈ కార్యక్రమం చేపట్టటం శుభపరిణామన్నారు. ఈ రక్తాన్ని తలసేమియా సికిల్ సెల్ వ్యాధితో బాధపడే పిల్లలకు అందిస్తామని తెలిపారు. శిబిరంలో 40 మంది సెక్యూరిటీ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం దాతలకు ఓఎస్‌టూ జీఎం జే.వేణుమాదవ్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎండీ జాకీర్ హుస్సేన్ రక్తదానం చేసిన సెక్యూరిటీలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, రమణమూర్తి, జేబీ మోహన్, కే.సత్యనారాయణ, ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.